# అమెరికా ఇల్లాలి ముచ్చట్లు

## శ్యామలాదేవి దశిక




శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 32




# అమెరికా ఇల్లాలి ముచ్చట్లు
## శ్యామలాదేవి దశిక



**అమెరికా ఐనా, అమలాపురమైనా ఇల్లాలు..ఇల్లాలే. ముచ్చట్లు ముచ్చట్లే..**

**ఓ అమెరికా ఇల్లాలు నెల నెలా మీతో పంచుకుంటున్న ముచ్చట్ల మురిపాలు..!**

## తెలుగు టీవీ

ఇదిగో మిమ్మల్నే, ఆ దిక్కుమాలిన టీవీ కాసేపు ఆపేసి ఇలా వస్తారా లేదా?

ఎన్నిసార్లు పిలవాలి?

వారంలో ఐదురోజులు ఆఫీసుకు అతుక్కుపోతారు.

శని, ఆదివారాల్లో టీవీకి అతుక్కుపోతారు.

వున్నవాటికితోడు ఈ తెలుగు మేళం ఒకటి!

రాను రాను పిల్లలకంటే అన్యాయమయిపోతున్నారు. ఏమన్నా అంటే, "ఇదిగో వస్తున్నా...అదిగో వెళ్తున్నా" అంటారే కానీ జండాకర్రల్లే నిలబడి ఆ టీవీ ముందునుంచి మాత్రం కదలరు. పిల్లలు హోంవర్కులు మానేసి టీవీ చూస్తున్నారని, వెధవ సినిమాలు చూస్తున్నారని, చెత్త మ్యూజిక్ వింటున్నారని వాళ్ళమీద అస్తమానం అరిచేవారు.

ఇప్పుడు మీరు చేస్తున్నది ఏంటిట?

దేశంలో ఇంకేవీ విషయాలే లేనట్టు అన్నీ సినిమా కబుర్లే! పేర్లు ఎన్నైనా భగవంతుడు ఒక్కడే అన్నట్టు ఎన్ని ప్రోగ్రాములు చూసినా, ఏపేరు పెట్టినా అన్నీ సినిమా సంగతులే ! ఇంతోటి సినిమాలను 'వండర్‌ఫుల్...ఫెన్‌టాస్టిక్..' అంటూ ఆకాశానికెత్తేయడం. తీరా చూద్దునుకదా "గుండక్కా, గంటన్నంతా డొల్లే!" అని చంపుకోడాలు, నరుక్కోడాలు షరా మామూలే. వెనక సినిమాల్లో చక్కటి భాష, నటన, హావభావన, సున్నితమైన ప్రేమ, హాస్యం వుండేవి. ఇప్పుడు సినిమాల్లో వేసే వాళ్ళకు ఎవరికీ ఒక్క తెలుగు ముక్క రాదు. వాళ్ళు చెప్పే డైలాగులు మనబోటివాళ్ళకు అర్థం కావు. ఆడవాళ్ళు మగవాళ్ళను మించిపోతున్నారు. ఇక పాటలు సరేసరి. వాయిద్యాలహోరులో ఒక్క ముక్కా వినపడదు. ఒకవేళ వినిపించినా అర్థమయిచావదు. వెనక హీరో - హీరోయిన్లు పార్కులోనో, పూలతోటలోనో ఇద్దరే రొమాంటిక్‌గా పాడుకునేవారు. ఇప్పుడేమిటో, పాట మొదలవ్వడం ఆలశ్యం, ఓ ముఠా సిద్ధంగా వుంటారు వెనక. నాకు తెలీక అడుగుతా, ప్రేమించుకునేవాళ్ళు ప్రియుడితోనో ప్రియురాలితోనో ఏకాంతంగా వున్నట్టు ఊహించుకోవాలి గాని, ఇలా గుంపుతో ఊహించుకోవడమేమిటీ వాళ్ళబొంద......

ఏమిటీ సినిమాలు నచ్చకపోతే సీరియల్స్ బోలెడు వస్తున్నాయిగా అవి చూడమంటారా?

ఆ..ఆసంబడమూ అయింది. వీటిమీద ఆ సినిమాలే నయం. ఆ సీరియల్స్‌లో ఎవ్వరికీ పనీ పాటా వుండదల్లేవుంది. తీరికూర్చుని ఏడుస్తూవుంటారు. అందరూ టిప్పుటాపుగా తయారయి ఎన్నిసార్లు ఎన్నిరకాలుగా ఏడవచ్చో చూపించి మనల్ని

ఏడిపిస్తుంటారు !

పోనీ ఇవి కాకుండా వేరే ప్రోగ్రామ్స్ చూద్దామా అంటే ఆ యాంకర్లు చేసే హంగామా భరించాలి. పేరుకు తెలుగు ప్రొగ్రామే అయినా ఎవరో ఒకళ్ళూ అరా తప్పించి ఒక్కళ్ళకూ సరైన తెలుగొచ్చి ఏడవదు. లోపల అసలు సరుకు లేకపోయినా పై డాబులకు మాత్రం ఎవ్వరూ తీసిపోరు. పెద్ద యాంకరు దగ్గరనుంచి, పిల్లయాంకరుదాకా అందరూ కట్టిన చీర కట్టకుండా, వేసిన హైర్ స్టైయిల్ వెయ్యకుండా తయారవుతారు ! వాళ్ళ మొహాలు, చీరలు, నగలూ చూసి సంతోషించాల్సిందే తప్ప నోరు విప్పితే భరించలేం. మొహాలు ముద్దుగావుంటే బావుంటుంది కాని, మాటలు (కూడా) ముద్దుగా వుంటే తలమీద మొట్టాలనిపిస్తుంది. పోనీ దేశం వదిలి ఎన్నో ఏళ్ళైది, మన వంటకాలు కొత్తవి నేర్చుకుందామని అవి చూడ్డం మొదలుపెట్టా ! అదీ మూన్నాళ్ళ ముచ్చటే అయింది !

వాళ్ళు చూపించేవన్నీ 'చూంచాం' స్ప్రింగు రైసులూ, టొమేటో సూపులూ, పాస్టాలు---- కాంటినెంటల్-- . ఇదిగో మీకు తెలుసో లేదో ఇండియాలో ఇప్పుడెవ్వరూ ఇడ్లీలు, బుడ్లీలు తినటం లేదట ! ఉదయం ఓట్ మీల్, మధ్యాహ్నం మష్రూం సూపులు, రాత్రి భోజనానికి బర్గర్లు తింటున్నారట ! అందుకే టీవీ వాళ్ళు కూడా అవే నేర్పుతున్నారు. గరిట చేత్తో పట్టుకోడం కూడా రాని ఓ పాకశాస్త్ర ప్రవీణురాలు చెప్తూంటే విన్నాను, స్వీటులో చివరికి ఎలకల (యాలకుల) పొడి చల్లితే రుచిగా వుంటుందిట ! రుచి మాట ఏమోగాని తిన్నవాడెవడో లపీమని చావడం మాత్రం ఖాయం !!

సరే ఇవన్నీ నచ్చకపోతే హాయిగా భక్తి ప్రోగ్రాములు చూసుకోవచ్చు కదా అంటారా? నిజమే. కానీ వాళ్ళు మొక్కుబడిగా చూపించే ఒకటీ, రెండు భక్తి ప్రొగ్రాములు పొద్దున్నే పెట్టి ఓ పని అయిపోతుందనుకుంటారు. పక్క మీద నుంచి లేస్తూనే టీవీ ముందు కూర్చోడానికి ఆడదానికి అందులో ఇక్కడివాళ్ళకు ఎలా కుదురుతుందటా? అయినా నాకు తెలీక అడుగుతా, పొద్దున్న తప్పించి మిగిలిన టైములో భగవంతుని గురించిన విషయాలు తెలుసుకోరాదని రూలు ఏమైనా వుందిటండీ? చోద్యం కాకపోతేనూ !

ఏమిటండీ ఆ భాష ?

వెరీగుడ్డండీ--- ఓకేనాండీ---"చూద్దామా" అనడానికి 'ఓ లుక్కేద్దామా?"

ఒకావిడ అంటుంది ఉదయాన్నే 'మార్నింగు పూజ' చేస్తుందిట !

ఫలానా వ్యక్తి బాగా పాడితే "పాట ఇరగదీసాడండీ" అనాలిట !

ఫలానా వాడు డాన్స్ బాగా చేస్తే "కుమ్మేసాడు" అనాలిట !

ఇలా భాషను చిత్రవధ చేస్తూ----

ఏమిటీ ఇవాళ - రేపూ ఎవరూ భాషను పట్టించుకోడంలేదా? ఆడవాళ్ళు ఫ్యాషనుబుల్‌గా, స్టైలుగా వుంటే వాళ్ళు ఎలా మాట్లాడినా బాగానేవుంటుందా?

అలాగా ? నాకు తెలీదు సుమండీ !

అయితే ఆ రోజుల్లో నా ఇంగ్లీషుని మీరెందుకు హేళన చేసారుటా? చెప్పండి !

సరే నాక్కూడా ఏడువారాల నగలు, చీరలూ పట్టుకురండి. ఆ టీవీలో ఆడాళ్ళకుమల్లే సింగారించుకుని స్టైలుగా కనబడుతూ, ఒయ్యారాలు ఒలకబోస్తూ సుతారంగా మీకు సూపులు వడ్డిస్తా ! ఓకేనా ?

# తప్పించుకు తిరుగువాడు

**ఏమిటీ మనంకూడా ఇండియాలో ఇల్లు కొనుక్కుందామా?**

ఇప్పుడు ఇండియాలో ఇల్లేం చేసుకుంటాం? ఇక్కడ నిక్షేపంలా ఇల్లు పెట్టుకుని?

ఏమిటీ కృష్ణారావుగారు ఇండియా వెళ్ళి కింగులా బతికేస్తున్నారా?

మనమూ ఇండియా వెళ్ళి దర్జాగా కాలుమీద కాలేసుకుని బతుకుదామా?

ఇప్పుడు మీ దర్జాకు లోటేమొచ్చిందటా?

అస్తమానం నన్ను డ్రైవింగు సీటులో కూర్చోపెట్టి, మీరు కాలుమీద కాలేసుకునే కదా తిరుగుతుంటా?

ఏమిటీ అక్కడకి వెళ్తే హాయిగా పనివాళ్ళని పెట్టుకుని అన్ని పనులు వాళ్ళతో చేయించుకుంటూ, నేను మహారాణిలాగా వుండచ్చా?

ఇదిగో ! ఇదే ముక్క 30 ఏళ్ళకిందట అన్నారు గుర్తుందా?

నేను 'అమెరికా వద్దండీ, అయిన వాళ్ళమధ్య ఇక్కడే వుందా'మన్నాను.

మీరు 'అమెరికా వెళ్తే అక్కడ హాయిగా వుండచ్చు. ముఖ్యంగా ఆడవాళ్ళకు అక్కడ లైఫు మూడు పూలు-ఆరు కాయలుగా వుంటుంది' అని కల్లబొల్లి కబుర్లు చెప్పి నన్ను ఇక్కడకి తెచ్చి పడేసారు.

నేను అమెరికా అక్కర లేదన్నానని మీకు కోపమొచ్చింది.

ఇండియాలో వుంటే ఇలా అంట్లగిన్నెలు తోముకుంటూ, పచారీ షాపులో వెచ్చాలు తెచ్చుకుంటూ బతుకులు గడిపేయాలని నన్ను బెదరగొట్టారు.

మీరు గమనించారో లేదో, నేను అమెరికా వచ్చి కూడా అంట గిన్నెలు తోముకుంటూనే వున్నాను. పచారీ షాపుకెళ్ళి వెచ్చాలు తెచ్చుకుంటూనే వున్నాను. అందులో మార్పేమీ లేదు. ఇండియాలోనే వున్నట్టయితే, అప్పట్లో నా గిన్నెలు నేను తోముకున్నా, ఆ తర్వాత పనివాళ్ళను పెట్టుకుని సుఖపడేదాన్ని ! మీరు నన్ను ఇక్కడకి తెచ్చి నాకు ఒరగపెట్టిందేమీ లేదు. అమెరికా వస్తే అన్నీ ఆటోమాటిక్‌గా అయిపోతాయని, అంచేత ఆడవాళ్ళకు ఆవగింజంతైనా వర్రీ వుండదని నమ్మించారు. కానీ అమెరికాలో ఆడవాళ్ళకు అందులో నాబోటి వాళ్ళకు అన్నీ వర్రీలే అని ఇక్కడికొచ్చాకగానీ తెలీలేదు.

అమెరికా వచ్చి రోజూ ఆఫీసుకెళ్తే చాలు మీ బాధ్యత తీరిపోయిందనుకునే మహానుభావులు మీరు. మీకు తెలిసిందల్లా మీపాటికి మీరు దర్జాగా బతికేయడం. అలా బతికేయడానికి మీరు ఏమైనా చేస్తారు. అప్పుడు సుఖపడటానికి అమెరికా వెళ్దాం అన్నారు. ఇప్పుడు సుఖపడటానికి ఇండియా అంటున్నారు. కానీ మీసుఖానికి వెనక ఓ ఆడదాని కష్టం, కృషి, సహనం, త్యాగం వున్నాయని మీకు తెలీదు. ఒకవేళ తెలిసినా తెలియనట్టు నటిస్తారు.

ఇన్నేళ్ళలో ఈ సంసారంకోసం నేను ఎన్ని ఇబ్బందులు పడ్డానో, ఎంత శ్రమించానో, ఎన్ని నేర్చుకున్నానో తెలుసా? అమెరికా అంటే ఐడియల్ ప్లేసు అనుకుంటారే తప్ప అమెరికా అంటే అయోమయం అని కూడా మీకు తెలీదు. దేశంలోనే వుంటే నా వాళ్ళ మధ్య నేను పెరిగిన సమాజంలో నాకున్న తెలివితేటలతో తేలిగ్గా పిల్లల్ని పెంచేదాన్ని. ఇక్కడ పిల్లల్ని పెంచటానికి, వాళ్ళను సరియైన దోవలో వుంచటానికి నేను ఎంత కష్టపడ్డానో మీకు తెలుసా?

మీ ఉద్యోగం పేరిట మీరు ఎప్పుడూ ఊళ్ళు పట్టుకొని తిరగడమే కదా. పిల్లలు చిన్నవాళ్ళుగా వున్నప్పుడు వాళ్ళతో ఆటలాడింది

నేను, వాళ్ళను స్కూళ్ళకు తీసికెళ్ళింది నేను, పిల్లలకు అనారోగ్యాలొస్తే డాక్టర్ల చుట్టూ తిరిగింది నేను, వాళ్ళ చదువుల గురించి విచారించేది నేను, కాలేజీలకు అప్లికేషన్లు పంపుతుంటే దగ్గరుండి చూసింది నేను, వాళ్ళను కాలేజీలో దింపేది నేను, వాళ్ళు ఇంటికొచ్చినప్పుడు మంచీ చెడ్డా కనుక్కుంటున్నది నేను.

ఇన్నేళ్ళుగా నేను ఈ సంసారాన్ని లాక్కొస్తూ మీకు అన్నీ అమర్చిపెడుతుంటే ఏ చింతా లేకుండా మీ కెరియర్ లో అంచెలంచెలుగా పైకి వెళ్ళి పేరు తెచ్చుకున్నారు.

ఇప్పుడు రిటైరై ఇంట్లో నెలరోజులుగా వుంటూ ఒక్కసారిగా కళ్ళు తెరిచారు. ఎంత చేస్తే ఇల్లు సజావుగా నడుస్తుందో ఇప్పుడిప్పుడే మీకు తెలిసొస్తోంది. అందుకే హడలిపోయి ఇండియా వెళ్ళిపోదాం అంటున్నారు ! ఇక్కడే వుంటే ఇవన్నీ మీ నెత్తి మీద పడతాయని బెంబేలెత్తిపోతున్నారు. అందుకే ఇక్కడినుంచి పారిపోదాం అంటున్నారు !

అప్పుడు అక్కడి కష్టాల్ని తప్పించుకోడానికి అమెరికా అన్నారు. ఇప్పుడు ఇక్కడి ఇబ్బందుల్ని తప్పించుకోడానికి ఇండియా అంటున్నారు. తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతీ అని ---------

నేను ఎక్కడికీ రాను. మీ కల్లబొల్లి కబుర్లు నమ్మి కరిగిపోడానికి నేను వెనకటి కమలను కాను !

# సత్యలక్ష్మి

ఏమిటీ అంటున్నారూ?

ఈ డ్రెస్సులో నేను మార్వెలెస్‌గా వున్నానా?

మా వూళ్ళో వాళ్ళు నన్ను ఇలా చూశారంటే మూర్ఛపోతారా?!

ఆ ఇచ్చే కాంప్లిమెంటేదో సరిగ్గా ఇవ్వచ్చుకదా?

అస్తమానం నన్నూ, మాఊరిని ఎగతాళి చేయటం మీకు బాగా అలవాటయిపోయింది!

మూర్ఛపోతే పోతారు అయితే ఏమిటిట? ఆ మాటకొస్తే ముప్పయి ఐదేళ్ళనాడు విమానం దిగిన నన్ను చూసి మీరు మూర్ఛపోలా?

పావలా సైజు బొట్టుతో, రేగిపోయిన వాలుజడతో , నలిగిపోయిన వెంకటగిరి చీరలో వున్న నన్ను చూసికూడా చూడనట్టు నటించారు, గుర్తుందా?

నన్ను తీసుకొచ్చి ఆ నాలుగు గోడల మధ్య పడేసి మీపాటికి మీరు వెళ్ళిపోయేవారు. నన్ను మీతో పాటు బయటికి తీసుకెళ్ళడానికి నామోషీ వేసి, " ఇక్కడి చలి నీకు అలవాటు లేదు. నాకు శెలవ లేదూ" అంటూ వంకలు చెప్పేవారు. మీ ఫ్రెండు డా: జాన్ నేను వచ్చానని తెలిసి మనల్ని వాళ్ళింటికి డిన్నరుకు పిల్చాడు. గుర్తుందా? వేరే గత్యంతరం లేక నన్ను వాళ్ళింటికి తీసుకెళ్ళారు. మనం అక్కడున్నంతసేపు మీరు ముళ్ళమీద కూర్చున్నట్లు గడిపారు. పాపం జాన్ భార్య ప్రత్యేకంగా వెజిటేరియన్ ఫుడ్డే వండింది నాకోసం అని. నేను కట్టుకున్న చీరని, నా పొడుగాటి జడనీ ఒకటే మెచ్చుకొంది !

వున్నట్టుండి మీ ఫ్రెండు "వుడ్డుయూ లైక్ స్క్రూడ్రైవర్?" అని అడిగితే కంగారులో నేను వెంటనే "నో, ఐ లైక్ పట్టకారు" అన్నాను. మీరు పళ్ళు కొరకడం వినిపించి పప్పులో కాలేసానని తెలుసుకున్నాను. ఆ మాటకొస్తే, మీరు మాత్రం తక్కువతిన్నారా? మీ ఫ్రెండ్స్ మీ గురించి

అంతా చెప్పారులేండి !
వచ్చిన కొత్తల్లో మాటిమాటికి రిపేర్లకొచ్చే మీ డొక్కుకారు గురించి మీరు చెప్తుంటే మీ ఫ్రెండు "యు షుడ్ గెట్ రిడాఫ్ దట్ లెమన్" అంటే 'నేను నా కారు గురించి మాట్లాడుతుంటే వీడు నిమ్మకాయ పారేయమంటాడేమిటీ, అయినా నా ఫ్రిజ్ లో వున్న నిమ్మకాయ సంగతి వీడికెందుకూ' అని విసుక్కున్నార్టకదా?!!
ఒకసారి కాన్ఫరెన్స్‌లో వున్న మిమ్మల్ని పేజ్ చేయటం విని మీ బాస్"డాక్టర్ రావ్, యు అర్ ఎక్స్యూజుడ్" అన్నాడని 'నేను ఇప్పుడు ఏం తప్పు చేసానని క్షమించానంటున్నావ్' అంటూ దెబ్బలాటకు దిగార్టకదా !

ఆ రోజుల్లో చదువులో, వయసులో, అనుభవంలో అన్నింట్లో తక్కువైన నేను మీముందు ఒక వెర్రిమొహంలా కనిపించేదాన్ని. కాని బయటికి వెళ్ళినప్పుడు మీరూ అంతే అని నెమ్మదిమీద తెలుసుకొన్నాను. డ్యూటీ పేరుతో రెండేసి, మూడేసి రోజులు వరసాగ్గా హాస్పిటల్లో వుండిపోయేవారు. నాకు ఇంట్లో ఏమీ తోచేదికాదు. ఒకరోజు మన లాండ్ లేడి కూతురు లూసీతో పాటు నేనూ కోర్సులు తీసుకోటానికి రిజిష్టరు చేసుకున్నాను. పీయూసీ క్వాలిఫికేషన్ తో అమెరికాలో చదవటం అంటే అనపర్తిలో చదివినట్టుకాదని నన్ను ఆట పట్టించేవారు గుర్తుందా? !

నాకు తెలియనివి మీదగ్గర చెప్పించుకోడానికి (అప్పట్లో) మీకు బోలెడు లంచాలు ఇచ్చుకునేదాన్ని ! కాలక్షేపానికని చేరిన నేను మాస్టర్స్ డిగ్రీ పుచ్చుకునేసరికి మనకి ముగ్గురు పిల్లలు పుట్టేసారు. ఎంతైనా పల్లెటూరి అమ్మాయిలకు పట్టుదల ఎక్కువ అంటూ ఓ కాంప్లిమెంట్ విసిరారు మీరు.

ఆ తర్వాత ఉద్యోగంలో చేరడం, ప్రమోషన్లు రావడం, పిల్లలు పెరిగి పెద్దవాళ్ళవటం అంతా చెకచెకా జరిగిపోయింది. ఆ రోజుల్లో పిల్లలకు హోంవర్కులో సాయం చేస్తున్నప్పుడల్లా నాకు చాలా గర్వంగా వుండేది. " Mom explains better. She is smarter than you Dad"
అని పిల్లలు అన్నప్పుడల్లా మీరు తెగ వుడుక్కునేవారు !! గుర్తుందా ?

ఈ ప్రపంచం ఎంత విశాలమైనదో, మనసుండాలేకానీ ఎన్ని నేర్చుకోవచ్చో, సమాజానికి ఎంత ఉపయోగపడచ్చో , అనపర్తి వదలి అమెరికా వచ్చాకగాని నాకు తెలియలేదు. చిన్నప్పుడు అమ్మ చేతికి పలక, బలపం ఇచ్చి బడికి వెళ్ళమంటే వెళ్ళనని మొరాయించేదాన్ని. ఒక్కసారి వెనక్కి తిరిగి గతంలోకి చూసుకొంటే ఇంత దూరం వచ్చింది వెంకటసత్యలక్ష్మిని నేనేనా అని మీకే కాదు, నాకూ ఆశ్చర్యం వేస్తుంది !!

# కష్టాలు

**అసలు నాకు అప్పుడప్పుడూ పెద్ద అనుమానం వస్తుంది.** జనాలందరూ వున్నచోట వుండకుండా ఇలా కుటుంబాల్ని పెళ్ళగించుకొని ఎక్కడెక్కడికో  వెళ్ళిపోవటంలో అర్థమూ పరమార్థము ఏమిటా అని?

ఏముందీ--- అక్కడుండే కష్టాల్ని తప్పించుకోడానికి, వేరే చోట సుఖంగా బతకటానికీ అంటారా?

ఏమోనండి, ఈ విషయంలో నా బుర్ర ఎప్పుడూ తికమక పడుతూ వుంటుంది..నాకు తెలీక అడుగుతా, మనం వున్న చోటునుంచి ఇంకో చోటుకు వెళ్ళినంత మాత్రాన కష్టాలు పోతాయటండీ మన పిచ్చి కాకపోతే !

రాత్రి వండిన అన్నం మిగిలితే మర్నాడు పులిహోర చేసుకుని తిన్నట్టు, కష్టాల రూపం మారుతుందే కాని అవెక్కడికీ పోవు.

మనల్నే చూడండి. ఇక్కడికి రాకముందు మనం ఇండియాలో వున్నప్పుడు మీరు ఏమనేవారో గుర్తుందా?

మన దేశంలో అవినీతి ఎక్కువ, ఇలాంటి చోట్ల మనకు మంచి ఉద్యోగాలు రావడం కష్టం, వచ్చినా అందులో నిలబడలేము అనే వారు.

అమెరికా వచ్చాక మనకు మంచి ఉద్యోగాలు వచ్చిన మాట నిజమే ! కానీ ఏ ఉద్యోగంలోనైనా ఎన్నాళ్ళుంటామో మనకే తెలీదు. ఇది మనిద్దరికీ అనుభవమే !

ఎప్పుడు ఎవరు డౌన్ సైజ్ చేస్తారో, ఏ టైములో మేనేజ్ మెంట్ మారుతుందో ఆ దేముడికే ఎరుక.

ఏ క్షణంలో ఉద్యోగాలు ఊడతాయో అని అనుక్షణం భయమే కదా?

అక్కడుంటే జన్మంతా అద్దెకొంపలో బతకాల్సిందే అని వాపోయారు. అమెరికా వచ్చామని బోలెడంత అప్పుచేసి ఇల్లు కొన్నారు. ఈ ఇంటికి మార్టిగేజ్ కట్టలేక మీపని, చాకిరి చెయ్యలేక నాపని అవుతున్నది ఇప్పుడు !

అసలే నేను అనారోగ్యం మనిషిని. పేరుకు ఇంట్లో ముగ్గురు పిల్లలు వున్నా ఒక్కరూ ఇక్కడి ప్లేటు తీసి అక్కడ పెట్టరు. వాళ్ళలోకమే వాళ్ళది. ఇల్లు కొనగానే పిల్లలకు తలా ఒక రూము ఇచ్చి మురిసిపోయారు ! ఇప్పుడు వాళ్ళు అ రూముల్లోంచి బయటకు రారని బాధ పడుతూ వుంటారు.

ఇండియాలోనే వుంటే పిల్లలకు మంచి చదువులు చెప్పించలేమని, వాళ్ళకు మంచి భవిష్యత్తు వుండదని అనేవారు. ఇప్పుడు పిల్లలకు మంచి చదువులు చెప్పించే స్థోమత మనకు వుంది. వాళ్ళకు వాళ్ళ భవిష్యత్తును తీర్చి దిద్దుకునే గొప్ప అవకాశాలు వున్నాయి. అయినా పిల్లలు 'మీరు చదవమనే చదువులు మాకు ఇష్టం లేదు. మా భవిష్యత్తు ఏదో మేము చూసుకుంటాం, ఇందులో మీ ప్రమేయం అనవసరం' అని గంటా పథంగా చెప్పారు !

పెద్దవాడు హైస్కూలు అవడంతోటే 'ఐ నీడ్ ఎ బ్రేక్' అంటూ చదువుకు సున్నా చుట్టాడు. అమ్మాయి రెండేళ్ళు కాలేజీ చదువు వెలగబెట్టి, మనకు చెప్పాపెట్టకుండా అర్థాంతరంగా ఆపేసి ఉద్యోగంలో చేరింది. ఇక చివరివాడు ఎప్పుడు చూసినా మ్యూజిక్ అంటూ ఆ బ్యాండు వాళ్ళతో తిరుగుతూ వుంటాడు. ఏవన్నా అంటే మ్యూజిక్కే నా ప్రాణం అంటాడు. ఇంక వీడేం ఒరగపెడతాడో చూడాలి. ఆ సంగీతంతో ఎలా బతుకుతాడో వాడికే తెలియాలి !

వయసు పై బడుతున్న కొద్దీ తుమ్మితే వూడిపోయే ఈ ఉద్యోగాలతో ముందు ముందు ఎలా అని భయం. ఎప్పుడు పడితే అప్పుడు బయటకు వెళ్ళే ఈ పిల్లలు క్షేమంగా ఇంటికి వస్తారోలేదో అని ఆందోళన. చదువుల మాట అటుంచి వీళ్ళు ఎవళ్ళతో స్నేహాలు చేస్తున్నారో, ఎటువంటి దోవలు తొక్కుతారో అని అదో హడలు. అన్నింటికి "వుయ్ నో వాట్ వుయ్ అర్ డూయింగ్" అనే ఈ పిల్లలు ఎప్పటికైనా పెళ్ళిళ్ళు చేసుకుని లైఫ్‌లో స్థిరపడగలరో లేదో అని దిగులు.

అనారోగ్యంతో మంచమెక్కితే నా సంగతి ఏమిటా అని అదో వర్రి. నాకేమైనా అయితే మీరేమైపోతారో అని గుబులు.

ఇలా భవసాగరాలు ఎన్నెన్నో-----

అందుకే, నాకనిపిస్తుంది, కష్టాలు తప్పించుకోవాలని మనం ఎంతదూరం వచ్చినా మనం వున్నంతకాలం అవి మన వెన్నంటే వస్తాయండీ. కాకపోతే డిఫరెంటు కష్టాలు--డిఫరెంటు లొకేషను. అంతే తేడా !

## హ్యాండు బ్యాగు

**ఏమిటీ ! నా బర్తుడే గిఫ్టుగా ఈ బ్యాగు కొన్నారా?**
ఈ భోషాణమంత బ్యాగ్ ఇప్పుడు నేనేం చేసుకోవాలిటా?
నాకు అన్నింటికి వీలుగా వుంటుందని కొన్నారా?
నేను మొయ్యాలే గాని బ్యాగేం ఖర్మ బస్తాయే కొనిస్తారు !
మన పెళ్ళైన కొత్తల్లో నా పుట్టినరోజుకు మీరు నాకు హ్యాండు బ్యాగు కొనిచ్చారు.
ఆ రోజుల్లో మీరిచ్చిన ఆ బ్యాగుని చూసుకుని మురిసిపోయాను !
అందులో నా అలంకార వస్తువులు పెట్టుకోవాలని చెప్పారు.
వెంటనే నా పౌడరు, తిలకం, కొత్త జేబురుమాలు అందులో పెట్టుకున్నాను.
ఆ రోజు సాయంత్రం నన్ను మీరు సినిమాకు కూడా తీసికెళ్ళారు.
మీరు రిక్షా మాట్లాడుతుంటే, నేను నడచి వెళ్దామన్నాను గుర్తుందా?
మెత్తగా అందంగా వున్న ఆ బ్యాగు పట్టుకుని రోడ్డుమీద నడుస్తూ నా అందం రెట్టింపయిందనుకున్నాను !
ఈ బ్యాగు నా సొంతం అని, అందులో నా వస్తువులన్నీ దాచుకోవచ్చని ఆనందపడ్డాను.

కానీ, అమెరికా వచ్చాక తెలిసింది హ్యాండు బ్యాగు ఆడవాళ్ళ అలంకారానికి గుర్తు కాదని, అది వాళ్ళ బాధ్యతలకు గుర్తూ అని.

బయటికెళ్ళినా అందరి అవసరాలు తీరుస్తూ వుండాలి కాబట్టి ఆడవాళ్ళకు హ్యాండు బ్యాగు చాలా అవసరమని అనుభవం మీద తెలుసుకున్నాను. వచ్చిన కొత్తల్లో పౌడరు, లిప్ స్టిక్, పెర్ ఫ్యూము పెట్టుకునేదాన్ని. ఒళ్ళో నా బ్యాగు ఖాళీగా వుందని తెలుసుకున్న మీరు నెమ్మదిగా టోల్ టిక్కెట్లు, టోల్ బూత్ దగ్గర పే చెయ్యడానికి తెచ్చిన చిల్లర డబ్బులు, టోకెన్లు, మీ మ్యాపుల కట్ట ఇచ్చి బ్యాగులో పెట్టుకోమనేవారు. అప్పుడప్పుడు మీ సిగరెట్లు కూడా నా బ్యాగులో పెట్టేవారు.

తర్వాత పిల్లలొచ్చారు. వాళ్ళు పసివాళ్ళుగా వున్నప్పుడు హ్యాండు బ్యాగుతో పాటు డైపర్ బ్యాగు సరేసరి !

తర్వాత పిల్లలు చిన్నవయసులో వున్నప్పుడు కారెక్కిన క్షణం నుంచి 'ఆర్ వుయ్ దేర్ ఎట్' అంటూ అడిగే వాళ్ళను శాంతపరచటానికి బ్యాగులో కుక్కీలు, క్యాండీలు, చాక్లెట్లు, చూయింగమ్ములు పెట్టుకునేదాన్ని.

పిల్లలు కాస్త పెద్దవాళ్ళయ్యాక వాళ్ళను మనతో పార్టీలకు తీసికెళ్ళడానికి గగనమయ్యేది. 'డు వుయ్ హేవ్ టు కమ్?' అంటూ నన్ను ఉద్ధరిస్తున్నట్లు బయలుదేరేవారు. ఎక్కడికెళ్ళాలన్నా ముందుగా వాళ్ళ బుక్సు , టేపులు, బాల్స్, పజిల్స్ నా బ్యాగులో కుక్కి మరీ కారెక్కేవారు. ఏవన్నా అంటే, 'వుయ్ నీడ్ దెమ్' అనేవారు.

వాళ్ళ వస్తువులతో నా బ్యాగు ఎప్పుడూ మా ఊళ్ళో నాదస్వరం ఊదే మస్తాను మొహంలా వుండేది !

నా బ్యాగు అని పేరుకే గాని దాన్నిండా పిల్లల వస్తువులే వుండేవి.

తెగిపోయిన టేపులు, మెల్ట్ అయిన చాక్లెట్టులు, ఎండిపోయిన చూయింగమ్ములు, ముక్కులు విరిగిన పెన్సిళ్ళు, రాయని పెన్నులు-------

ఇంట్లో ఎవరికి ఏ వస్తువు కనిపించకపోయినా వెంటనే "చెక్ మామ్స్ బ్యాగ్" అంటూ దాడి చేస్తారు. ఆ బ్యాగ్ మీ సొంతమే అన్నట్లు సోదా చెయ్యడమే కాకుండా అవసరమైతే కిందా మీదా బోర్లించి కావాల్సింది కనబడితే తీసేసుకుని, కనిపించకపోతే నన్ను బ్లేమ్ చేసి వెళ్ళిపోతారు.

పిల్లలు పెద్దవాళ్ళైన తర్వాత హమ్మయ్య అనుకుని నా హ్యాండు బ్యాగు నా సొంతం అవుతుందని భ్రమ పడ్డాను.

కానీ మీరు నాకు ఇంకో పిల్లాడై కూర్చున్నారు !

గడప దాటితే చాలు "ఇదిగో" అంటూ వాలెట్, కళ్ళజోడు, పెన్ను, ఆఫీసు తాళాలు అంటూ చదివింపులు మొదలుపెడ్తారు. అసలు మీ వస్తువులు నేనెందుకు మొయ్యాలిటా? నాకు తెలీకడుగుతా.

ఏవన్నా అంటే పిల్లలకంటే ఎక్కువగా మీ పన్లలను సమర్ధించుకుంటారు.

పర్సు బ్యాక్ పోకెట్టులో పెట్టుక్కూర్చుంటే నడ్డినెప్పి.

తాళాలు జేబులోవుంటే గుచ్చుకుంటాయి.

కళ్ళజోడు షర్టు జేబులో పెట్టుకుంటే వంగినప్పుడల్లా టప్పుమని కింద పడుతుంది.

అందుకని నా హ్యాండు బ్యాగులో పెడితే ఏ గొడవా వుండదు మామూలే-----

పోనీ అంతటితో ఆగారా అంటే లేదే

లేటు వయసులో ఘాటు ప్రేమ అని ఇంత వయసొచ్చి మళ్ళీ తల్లినయినట్టుంది నాపని !

పిల్లలు పసివాళ్ళప్పుడు కూడా నాకు ఇంత పని వుండేది కాదు.

మరి ఇప్పుడు ఇల్లు కదలాలంటే ఎంత తతంగం !
'తింటే ఆయాసం, తినకపోతే నీరసం' అని మీకు ఎప్పుడు ఆకలేస్తుందో, ఎక్కడ నీరసం వచ్చి మీ షుగర్ లెవెల్ పడిపోతుందో అని భయం. దీనికి తోడు సీజను మారితే చాలు నేనున్నానంటూ తయరయ్యే ఆస్మా ఒకటి. కీళ్ళబాధ వుండనే వుంది. ఇందుకోసం జ్యూస్ బాటిల్స్, నీళ్ళ సీసాలు , ఎమర్జెన్సీ ఫుడ్లు, గ్లూకోజ్ మానిటరు, ఇన్‌హేలరు, కీళ్ళనొప్పి క్రీము, మీ మూతీ ముక్కు తుడుచుకోవడానికి టవలు, టిస్యూలు, మీ సెల్ ఫోను, నా నెత్తికాయ-----
పెళ్ళి---పిల్లలు---సంసారం---బాధ్యతలు పెరిగినట్లే నా బ్యాగు బరువు కూడా పెరుగుతూ వచ్చింది.

కాలంతో పాటు మనమూ మారుతున్నట్లు నా హ్యాండు బ్యాగు కూడా అవసరానికి అనుగుణంగా సైజు, క్వాలిటీ, ఎఫిషియెన్సీ మారుతూ వుంటుంది. ఏ వెకేషనకు వెళ్ళినా మీరు కేర్ ఫ్రీ గా తిరిగేస్తూ నేను ఎక్కడ రిలాక్స్ అవుతానో అని "నీ హ్యాండు బ్యాగు జాగ్రత్త" అంటూ రిమైండ్ చేస్తూ వుంటారు !

ఇండియా వెళ్ళినప్పుడల్లా, రైలు ప్రయాణాల్లో మీరు- పిల్లలూ సుబ్బరంగా భోజనాలు కానిచ్చి బర్తులు పరుచుకుని గురకలు పెట్టి నిద్ర పోతూ వుంటారు. నేను నా బ్యాగులో వున్న డబ్బు కట్టలు, టిక్కెట్లు, పాసుపోర్టులు ఎవడూ ఎత్తుకుపోకుండా కాపలా కాస్తూ వుంటాను. బాధ్యత అనే పదవి మొగాళ్ళ సొత్తే అయినా దాన్ని కాపలాకాసి కాపాడేది ఆడదేకదా?

మీ అవసరాలకు అంతరాయం కలగకుండా వుండటానికే మీ మగవాళ్ళు "లేడీస్ హ్యాండు బ్యాగు" ని కనిపెట్టారు. అందుకే ఎన్నో అందాల్ని విరజిమ్మేటట్లు తయారుచేసారు !

పైకి ఎంతో మెత్తగా, సుకుమారంగా కనపడే ఈ హ్యాండు బ్యాగులు లోపల ఎంతో బరువును మోస్తూవుంటాయి ఆడదానిలాగే !

## ఆల్ ఇన్ వన్

**నా దగ్గరే కాని ఏదైనా మాజిక్ పవర్ వుంటే ఏం చేస్తానో తెలుసా ?**

ముందు కాలచక్రాన్ని ఓ ఏభైఏళ్ళు వెనక్కి తిప్పేసి మీ మగాళ్ళ బుర్రల్లో నుంచి మీ డిగ్రీలన్నీ వూడలాగేసుకుంటాను. అందర్ని ఏ అనకాపల్లిలోనో స్కూలుఫైనలు వరకు చదివించి, అమాంతం అమెరికాలో పడేసి ఇప్పుడు చూపించండి మీ ప్రతాపం అంటాను !

గొట్టం పాంట్లు, టెర్లిను షర్టులు వేసుకుని, సిగరెట్లు కాలుస్తూ, సైకిళ్ళు తొక్కుకుంటూ దార్లో కనిపించిన అమ్మాయిలకు సైట్లు కొడుతూ కాలేజీలకెళ్ళి డిగీలు సంపాదించారు. అవి చాలవన్నట్టు ఇక్కడకొచ్చి ఇంకో కట్ట డిగ్రీలు తెచ్చుకొని నాలాంటి ఇల్లాళ్ళ ముందర పెద్ద పోజులు కొడ్తారా ? మీకు చాతనైతే మాలాగా అత్తెసరు చదువులతో వచ్చి చెలామణి అవ్వండి అప్పుడు చూద్దాం ! అదేమంటే

చేతిలో చిల్లిగవ్వ లేకుండా ఇక్కడికొచ్చి ఇంతవాళ్ళమయ్యామని గొప్పలు చెప్పుకుంటారు.

ఆ రోజుల్లో మీ పాకెట్లో పెన్నీ లేకపోతేనేం--- చేతిలో డిగ్రీలకట్ట, పీస్ పాస్ అంటూ నోట్లో ఇంగ్లీష్ భాషా వున్నాయిగా ? ఇక్కడికొచ్చి అక్కడికేదో మీరే అన్ని అవస్థలు పడి అంతా వుద్ధరించినట్లు ఆపసోపాలు పడుతూ క్రెడిట్ అంతా పుచ్చేసుకోవడం !

అమ్మా అబ్బలను అడక్కుండా, కట్టుకున్న పెళ్ళాంతో కన్సల్ట్ చేయకుండా అమెరికా వెళ్ళాలని మీపాటికి మీరు డెసిషన్లు తీసేసుకున్నారు. పైగా పెళ్ళాన్ని పైదేశాలకు తీసికెళ్ళగలిగిన మగాడ్ని నేనే అని అందరిముందు కాలరెత్తుకుని తిరిగారు. వెనకటికి మీలాంటివాడే ఆలికి అన్నం పెట్టడం ఊరికి ఉపకారం అనుకున్నాట్ట !

అసలు ఆ రోజుల్లో నాలాంటి అమ్మాయిలు పెళ్ళెందుకు చేసుకునేవారో తెలుసా ?

పెళ్ళైతే దర్జాగా మొగుడిపక్కన రిక్షాలో కూర్చుని హాయిగా సినిమాలకెళ్ళచ్చని, పెళ్ళైతే పట్టుచీర కట్టుకొని చక్కగా నోములు-పేరంటాలు చేసుకోవచ్చని...... నామటుకు నేను ఎందుకు ఎందుకు చేసుకున్నానో తెలుసా ? పెళ్ళిచేసుకుంటే, మా బామ్మ నాకు మామిడిపిందెల నెక్లెసు చేయిస్తానంది. వెంటనే సరే అన్నాను ! అంతే కాని మిమ్మల్ని మోహించి కాదు.

అట్లాంటి అమాయకపు ఆడపడుచుల్ని వున్నపళంగా ఇక్కడకి తెచ్చి పడేసి మీ చావు మీరు చావండన్నారు ! ఎనాడైనా మా సంగతి పట్టించుకున్నారా ? పక్కన కూర్చోపెట్టుకుని ఇక్కడి భాషా, పద్ధతులు నెమ్మదిగా నేర్పారా ? తెలివితేటల్లో ఐన్ స్టైన్లము, ఇంగ్లీష్‌లో షేక్స్పియర్లము అనుకున్న మీకే అమెరికా అయోమయంగా అనిపిస్తే, మరి మాలాంటి వాళ్ళ గతి ఏమిటో గ్రహించారా ?
పేరుకు ఆఫీసు పార్టీలకు, గెట్టుగెదర్లకు తీసికెళ్ళినట్టే తీసికెళ్ళి అక్కడ మాఖర్మానికి మమ్మల్ని వదిలేసేవారు. మీపాటికి మీరు మీతెలివితేటల్ని వెళ్ళబోసుకుంటూ జెల్సాగా గడిపేవారేగాని పక్కనుండి మాకేమన్నా ధైర్యమిచ్చారా ? అప్పట్లో మీకున్న చదువులూ, డాబులు మాకు లేవనేగా మామీద చిన్నచూపు !

నన్నడిగితే మీకంటే ఇక్కడివాళ్ళే నయం. మీకన్నా వాళ్ళే మమ్మల్ని బాగా అర్థం చేసుకున్నారు ! అప్పట్లో మీకు 24 గంటలు పని ధ్యాస తప్ప, వేరే ధ్యాస వుండేది కాదు. ఎంతసేపూ మీపేరు ప్రతిష్టల గురించి పాకులాటే కానీ మాసంగతి మీకు పట్టేదికాదు.
మీరొక్కరేకాదులేండి ఆ రోజుల్లో వచ్చిన మగాళ్ళందరూ ఇదే వరస.
పంజరంలో చిలకలా పడివున్న నన్ను చూసినప్పుడల్లా మన పక్కనే వుండే మేరీ నవ్వుతూ విష్ చేసేది ! నేను 'నో ఇంగ్లీష్' అని అన్నా నాతో మాట్లాడుతూనే వుండేది ! ఒకరోజు తన కార్లో మనం వున్న వూరంతా తిప్పింది. ఎక్కడెక్కడ ఏం దొరుకుతాయో అన్నీ వివరంగా చెప్పింది. మిషిన్‌లో డబ్బులు వేసి బట్టలు ఎలా వుతుక్కోవాలో చూపించింది. మావాళ్ళకు నేరాసుకున్న ఉత్తరం నాచేతిలో చూసి, నన్ను పోస్టాఫీసుకు తీసుకెళ్ళి ఉత్తరం డబ్బాలో ఎలా వెయ్యాలో చూపించింది. నాకు ఇంగ్లీష్ మాట్లాడటం రాదని సిగ్గుతో భయపడుతుంటే "డోన్ట్ వర్రీ, యూ విల్ బి ఫైన్" అంటూ నవ్వుతూ ధైర్యమిచ్చేది. నా అన్నవాళ్ళు లేని నాకు ఆ రోజుల్లో మేరీ చేసిన సాయం ఎప్పటికీ మర్చిపోను. అప్పుడు ఆవిడ ఇచ్చిన ప్రోత్సాహమే ఆ తర్వాత నన్ను ఇంతదాన్ని చేసింది !

అప్పట్లో ఆడవాళ్ళలో ఒకళ్ళూ అరా తప్ప అందరూ కొద్ది చదువుల వాళ్ళే. అయితేనేం తర్వాత ఎంత ఎత్తుకు ఎదిగారో

చూడండి. ఈ దేశం వచ్చినప్పుడు రెడీమేడ్ గా మీలాగా మాకు డిగ్రీలు లేకపోయినా నెమ్మదిమీద మేమూ సంపాదించుకున్నాం. ఇష్టమైనవాళ్ళం ఉద్యోగాలు చేసాం. ఇంకొకరి సాయం లేకుండా పిల్లల్ని పెంచి పెద్ద చేసాం. ఆడపని, మొగపని అని తేడా లేకుండా అన్నీ నేర్చుకున్నాం.

ఇప్పుడు ఒక చేత్తో కారు నడపగలం, ఇంకో చేత్తో కాజాలూ  చెయ్యగలం.

వు ఆర్ ఆల్ ఇన్ వన్ ! (అన్ లైక్ యూ  !)

# అమ్మవారు

**ఏమిటీ అంటున్నారూ? అమ్మవారు అచ్చం లక్ష్మీదేవిలా వుందా?**

బూరెలూ, గారెలూ అసలైన ఆకారాల్లో వున్నాయా?

ఏదీ కాస్త వెసులుబాటుగా, తాపీగా చేసుకున్నది ఈ ఏడాదేగా !

అప్పట్లో పెళ్ళైన వెంటనే మీతో అమెరికా వచ్చేయడంతో నా మొట్టమొదటి వరలక్ష్మీ వ్రతం ఇక్కడే జరిగింది.

ఇండియా నుంచి ఉత్తరం వచ్చింది, ఫలానా రోజు వరలక్ష్మీ వ్రతం పూజ చేసుకో అని. పూజ చేసుకోమని రాసారు కానీ ఎలా చేసుకోవాలో, ఏంచెయ్యాలో రాయలేదు.

పీచులేని కొబ్బరికాయకు రవికెలగుడ్డ ఎలా పెట్టాలో తెలీలేదు. నేను చేసిన అమ్మవారిని చూసి మీరు పడీ పడీ నవ్వటం మొదలుపెట్టారు. మీ నవ్వు చూసి నాకు వుక్రోషం ముంచుకొచ్చింది. మనం వుంటున్న కేంపస్‌లో మనవాళ్ళు ఎవరూ లేకపోవడంతో పళ్ళూ-సెనగలూ తీసికెళ్ళి మనపక్కనే వుంటున్న మార్గరెట్‌కు ఇచ్చాను. ఆవిడ చాలా మురిసిపోతూ తీసుకుంది. ఆవిడ మర్నాడు సెనగల్ని సాలడ్‌లో వేసుకున్నానని చెప్పింది. గుర్తుందా ?

ఆతర్వాత పిల్లలు సంసారంలో మునిగిపోయాం. నా అమ్మవార్ని ఎక్కడ పెట్టినా పిల్లలు పీకేసేవారు. బాబిగాడైతే సరేసరి. ఒకసారి అమ్మవారికోసం చేసిపెట్టిన పిండిని వాడి చిట్టిచేతులతో శుబ్బరంగా పిసికేసి తినేశాడు గుర్తుందా ?!

మీకెక్కడ గుర్తుంటుందిలేండి!

ఓ ఏడాది కొబ్బరికాయమీద రెవికల గుడ్డ అమరుస్తుంటే నా కొడుకు బంగారు తండ్రి రాజా 'వాటీజ్ దట్?' అంటూ అడిగాడు. నేను ఈరోజు ఆవిడ బర్తుడే అని అందుకని స్పెషల్ హాట్ పెడుతున్నానని చెప్పాను. అప్పటికి అర్ధమైనట్లే బుర్ర ఊపి నేను అటు వెళ్ళగానే ఆ రవికల గుడ్డ తీసేసి వాడి బర్తుడే హాట్ తెచ్చి పెట్టాడు! నేను తీసేయబోతుంటే ఏడుపు లంకించుకున్నాడు. మీరు 'పోనీలే వుండనీ, నువ్వు పెట్టిన జాకెట్టు గుడ్డ కన్నా ఇదే బావుంది' అని నవ్వడం మొదలుపెట్టారు. వాడిని శాంతింపజేయటానికి ఆ రోజు బూరెలతో పాటు బర్తుడే కేక్ కూడా నైవేద్యం పెట్టాను.

పెద్దవాడు ఎంత నెమ్మదో బాబిగాడు అంత కొంటె కోణంగి. వాడికి అన్ని మీ బుద్ధులే వచ్చాయి. నా అమ్మవార్ని ఏదో ఒకటి అనందే వాడికి తోచేది కాదు. మామ్ షి లుక్స్ డిప్రెస్సుడ్, మామ్ షి లుక్స్ స్కేరీ లైక్ మై సైన్స్ టీచర్, మామ్ షి లుక్స్ వీర్డ్ ----ఇలా.

తప్పురా అలా అమ్మవార్ని అనకూడదురా అంటే, ‘ఐ యామ్ నాట్ సేయింగ్ ఎనీ థింగ్ ఎబౌట్ హెర్, ఐ యామ్ సేయింగ్ యూ నీడ్ లాట్సాఫ్ ప్రాక్టీస్ ! ’ అంటూ పారిపోయేవాడు. ఇలా వంకలు పెడుతూనే ఆ రోజు నేను చేసినవన్నీ లాగించేవాడు.

వాళ్ళ ఇద్దరి తర్వాత అమ్మాయి, రాణీగారు ! అడిగినవన్నీ కొనిచ్చి గారాబం చేసి నెత్తిమీద ఎక్కించుకున్నారు. అమ్మవారికి ఏనగలు పెట్టబోయినా ‘దె ఆర్ మైన్, షి కేంట్ హేవ్ దెమ్‘ అంటూ లాగేసుకునేది. కొంచెం పెద్దదైన తర్వాత ఏదో కాస్త నేర్చుకుంటుందన్న ఆశతో సాయం అడిగేదాన్ని. విసుక్కుంటూ వచ్చేది. ఒకసారి దాని ఫ్రెండుతో దెబ్బలాడి ఏమీ తోచక కిందికొచ్చి ’ ఐ విల్ మేక్ హెర్ రెడీ యూ గో ’ అంటూ నన్ను తరిమేసింది. కాసేపయిన తర్వాత చూద్దును కదా ! రామ రామ--- ఇదేమిటే ఇలా చేసావు ? అంటే 'వాట్ మామ్, షి లుక్స్ కూల్!' అంటూ తను ముస్తాబు చేసిన అమ్మవార్ని చూసుకుని మురిసిపోయింది. అప్పటినుంచి ఇక ప్రతి ఏడాది దాని ఇష్టంవచ్చినట్లు అలంకరించేది. నేను అమ్మవారికి జడవేస్తే 'దటీజ్ ఓల్డ్ ఫాషన్ మామ్, షి ఈజ్ ఇన్ అమెరికా!' అంటూ నామాట లెక్కచెయ్యకుండా రకరకాల హెయిర్ స్టైల్స్ చేసేది. పైగా దాని ఫ్రెండ్స్‌ని పిలిచి చూపించుకునేది.

నేను మొదటిసారి అమ్మవార్ని చేస్తే ‘ఈవిడ అమ్మవారిలా లేదు. నీలాగా కాలేజ్ గర్ల్‘లా వుందని ఏడిపించారు గుర్తుందా ?! తర్వాత మన అమ్మాయి చేతిలో అమ్మవారు టీనేజ్ గర్ల్‌లా వుందనిపించేది నాకు. కానీ మీఅమ్మాయి చేసిన అమ్మవారు మీకళ్ళకు బాగానే వుండేది, 'గుడ్ జాబ్ షి లుక్స్ ఆసమ్' అంటూ కూతుర్ని పొగిడేవారు !

ఏమిటోనండి కన్నుమూసి కన్ను తెరిచేంతలో పిల్లలు పెద్దవాళ్ళయిపోయారు. ఎవరి బతుకులు వాళ్ళు బతుకుతున్నారు. కిందటేడాది అమ్మాయి కూడా పెళ్ళిచేసుకుని దానింటికి అది వెళ్ళిపోయింది.

నాకు మాత్రం మునపటి అమ్మవారే బావుందనిపిస్తోంది. నా పిల్లలు ఆవిడ నెత్తిమీద బర్తుడే హాటులు పెట్టినా, మెళ్ళో స్కార్ఫ్‌లు చుట్టినా, గిల్ట్ నగలు పెట్టినా, కేకులు నైవేద్యాలు పెట్టినా ఆ తల్లి ఏమీ అనుకోలేదు. ఆ దేవి అనుగ్రహంతోనే ముగ్గురూ ఎవరూ వేలెత్తి చూపించకుండా పెరిగారు. చక్కగా ఎదిగారు.

అంతకన్నా మనకు ఇంకేం కావాలండీ---

కానీ పిల్లలు లేని ఇల్లు బోసిగా వుందండీ---

ఏమిటీ కొన్నాళ్ళకు మన మనవలూ, మనవరాళ్ళతో నా అమ్మవారికి మునుపటి కళ వచ్చేస్తుందా ?

ఎంత తియ్యని మాట చెప్పారండీ ! !

అత్తకడుపు చల్లగా ---అమ్మ కడుపు చల్లగా ---

ఇదిగో ఈ పూర్ణం బూరె తినండి---

## బతుకు పడవ

**ఏమిటీ బయట మంచు చూసి మండి పడుతున్నారా?**

తెలిసిన సంగతే కదా, అయినా ఇప్పుడేం కొంప మునిగిపోయిందటా బయటకు వెళ్ళకపోతే?

లేడికి లేచిందే పరుగని అనుకున్నవి ఆ క్షణంలో జరగాల్సిందే మీకు !

ఎందుకు అంత చిరాకు పడ్తారు. ఈ స్నో స్ట్రామ్ ఇప్పుడిప్పుడే తగ్గదుకానీ, హాయిగా ఇంట్లో కూర్చుని ఎంజాయ్ చెయ్యండి ! ఎందుకు అలా నవ్వుతారు. ఓ చెంప స్నో పడుతూంటే సంబరాలు చేసుకుందాం రమ్మంటుందేమిటా అని అనుకుంటున్నారు కదూ ? అక్కడేవుంది మీ బస్తీ వాళ్ళకు, మా పల్లెటూరి వాళ్ళకు పెద్ద తేడా.

చిన్నప్పుడు చదూకోటానికి, పెద్ద అయిన తర్వాత పని చెయ్యడానికే పుట్టాం అనుకునే మీలాంటివాళ్ళు ఎక్కడున్నా ఒకటే. ఇన్నేళ్ళనుంచి అమెరికాలో వుండే లైఫ్ ఎంజాయ్ చెయ్యడం తెలీదు మీకు - ఇక గాలి వానలూ, మంచు తుఫాన్లు, మండుటెండలు ఎంజాయ్ చెయ్యడం ఏం తెలుస్తుంది?

అసలు సరదాగా గడపాలనే సంకల్పం, కాస్తంత క్రియేటివిటీ వుండాలేకాని ఎక్కడున్నా, ఎప్పుడైనా ఆనందంగా గడపవచ్చు. నాకు ఎలా తెలుసునంటారా?

నేను చిన్నప్పుడు అలాంటి వాతావరణంలో పెరిగినదాన్ని కనుక, పైపెచ్చు నేను కోనసీమ అమ్మాయిని - నా బుర్ర వజ్రాలగని!

మావూళ్ళో వానాకాలం వచ్చిందంటే మాకు వెకేషన్ అన్నమాటే ! మనసు ఎప్పుడు ఆటలమీద, అల్లరిమీద వుండే నాలాంటివాళ్ళకు వానలు పడినప్పుడల్లా బడి మూత పడటం పెద్ద బెనిఫిట్ !

బళ్ళోకి వెళ్ళక్కరలేదు సరి కదా, ఇంట్లో కూర్చుని బోలెడు ఆటలు ఆడుకోవచ్చు. చద్దెన్నం తినగానే దొరికిన చిత్తుకాగితాలన్నీ పోగేసుకుని అందరం రకరకాల పడవలు చేసుకునేవాళ్ళం. సాదా పడవలు, కత్తి పడవలు, రెండతస్తుల పడవలు, పువ్వుల పడవలు మాకున్న టాలెంటునిబట్టి చేసుకునేవాళ్ళం. మాచిన్నన్నయ్య పిల్లలందరికి "పడవల పందెం" పెట్టేవాడు. వానలో తడవకండర్రా అంటున్నా వినకుండా ఎవరికి వారు వాళ్ళ పడవ మునిగిపోకుండా వెళ్ళాలని, పందెంలో గెలవాలనీ ఒకటే దండాలు పెట్టుకుంటూ గోలగోల చేసేవాళ్ళం !

ఈదురుగాలి, కుండపోతగా కురిసే వానలో బయటకు వెళ్ళలేనప్పుడు, పిల్లలందరం చేరి ఇంట్లో వున్న బిందెలు, బకెట్లు చూరుకింద పెట్టి నీళ్ళు నింపేవాళ్ళం. మనిషికి ఇన్ని చెంబులని లెక్కపెట్టి ఇచ్చిన వేడినీళ్ళతో ఆ ఈదురుగాలిలో స్నానం చేసి పొడి (వెచ్చని) బట్టలు వేసుకున్నప్పటి ఆనందం అనుభవించినవారికే తెలియాలి. ఇంట్లో కూరా, నారా ఏమీ లేకపోయినా పెద్ద రాచిప్పలో అమ్మ పెట్టే పప్పుపులుసు ఘుమఘుమ, వేడి వేడి అన్నంలో కందిసున్ని, తియ్యని గడ్డపెరుగు రుచి ముందు మీ ఫైవ్ స్టార్ హోటల్ భోజనం ఎందుకూ పనికి రాదు.

నాన్న, అన్నయ్య పుస్తకాలు చదువుకుంటే, అమ్మ మమ్మల్ని కూర్చోబెట్టి గవ్వలాట, పచ్చీసు ఆటలు ఆడించేది. రాత్రికి నాన్న అందరికి కాశీమజలీ కథలు చెప్పేవారు.

ఏడాదిపాటు కష్టపడగా చేతికొచ్చిన పంట చివరికి ఏమైపోతుందో అని నాన్న పడే ఆందోళన గాని, ఇంటికప్పు ఎక్కడ కూలిపోతుందో అన్న అమ్మ భయం కాని చిన్నపిల్లలమైన మాకు తెలిసేది కాదు. మాకు తెలిసిందల్లా కుండపోతగా వర్షం పడితే ఇంటిల్లిబాదికి ఆటవిడుపని !

అందుకే నా ఫిలాసఫీ కూడా లైఫ్‌ని వీలైనంతవరకు నవ్వుతూ, సరదాగా గడిపయటమే ! జీవితంలో తుఫానులు ఎదురైనప్పుడల్లా మా బతుకు అనే పడవ మధ్యలో మునిగిపోకుండా ఎలాగో అలాగు తీరానికి చేర్చు స్వామీ అని వేడుకుంటూవుంటాను.

ఇదిగో మిమ్మల్నే వింటున్నారా ?

నామాట విని బయటకు వెళ్ళే ప్రోగ్రాము కాన్సిల్ చేసుకోండి.
అల్లం పచ్చడితో వేడివేడిగా M.L.A. పెసరట్టు తిందాం. ఆ తర్వాత ----
ఏమిటీ నా అయిడియా అద్భుతంగా వుందా?

అమ్మయ్యా, ఇన్నాళ్ళకు లైటు వెలిగింది !

# క్రీమ్ ఆఫ్ ది క్రాప్

**అప్పుడప్పుడు నాకనిపిస్తుంది, మీకు చేతులెత్తి నమస్కారం చెయ్యాలని !**
పుణ్యంకొద్ది పురుషుడని ఏ జన్మలో ఏం పుణ్యం చేసుకున్నానో
మీలాంటి వ్యక్తి---------
ఏమిటీ? ఏమైనా పుచ్చుకున్నావా అంటున్నారా?
లేదండీ ! నిజంగానే అంటున్నాను.

ఆ రోజుల్లో మీరు అమెరికా వెళ్తుంటే ఆవు వెంబడి లేగదూడలాగా మీ వెంట వచ్చాను. కొత్త దేశమైనా మీరు మాత్రం మీకున్న చదువుతో కొండంత విశ్వాసంతో వుంటే, నేను భయం భయంగా బిక్కుబిక్కుమంటూ నాజీవితం మొదలుపెట్టాను. నావాళ్ళ దగ్గరనుంచి నన్ను దూరం చేసి ఈ అమెరికా అడవిలో పడేసారని విసుక్కునేదాన్ని. అప్పట్లో మీమీద వుండే భయంతోటో, భక్తితోటో పైకి ఏమీ అనేదాన్ని కాదు. కానీ మిడిమిడి చదువులతో మిడిల్ క్లాస్ అమ్మాయిగా పెరిగిన నన్ను, ఇలాంటి హై క్లాస్ సొసైటీలో పడేసినందుకు లోలోపల తిట్టుకునేదాన్ని !

కొన్నాళ్ళయిన తర్వాత గాని తెలిసిరాలేదండి, నన్ను అమెరికా తెచ్చి నాకు ఎంత మేలు చేసారో !

మీలాంటి మగాళ్ళ ధర్మమా అని నాలాంటి అమ్మాయిలెందరో ఎక్కడో పడివుండాల్సిన వాళ్ళం ఎక్కడికో వెళ్ళాం. ఆ రోజుల్లో మీరు ధైర్యంగా ఇలా రాబట్టే నాలాంటి ఆడవాళ్ళు ఇంత ముందుకు వెళ్ళగలిగారు.
మీరు మగాళ్ళు, మీకు తెలియదు.

ఆ రోజుల్లో మధ్యతరగతి అమ్మాయిలకు మధ్యతరగతి ఆలోచన్లు, మధ్యతరగతి కోరికలే వుండేవి. చేసుకున్నవాడు తిండీ, బట్టా ఇచ్చి పుట్టింటికి తరిమేయకుండా, కాస్తంత ప్రేమగా చూసుకుంటే అదే మహాభాగ్యం అనుకునే రోజులవి.

అసలు మా రాతల ప్రకారం ఏ బళ్ళో టీచరో, ఏ తాలూకా ఆఫీసులో గుమాస్తాకో, మహా అయితే బ్యాంకులో ఏ క్లర్కుకో పెళ్ళాలై అత్తెసరు బతుకులు బతకాల్సినవాళ్ళం ! అలాంటిది నాలాంటి ఎంతోమంది ఇల్లాళ్ళకు పెద్దపెద్ద డాక్టర్లు, గొప్పగొప్ప ఇంజినీర్లు, పేరున్న సైటిస్టులు భర్తలుగా వచ్చారంటే అది అదృష్టం కాక మరేమిటి? !

మెళ్ళో మూడుముళ్ళు పడగానే మనసులోని ఆశలను-ఆశయాలను అణచివేసుకోవాలి కాబోలు అనుకునే నాలాంటి ఆడపిల్లలకు మీలాంటి మగాళ్ళు ఊపిరిపోసారు. ఇక్కడి సంఘంలో నిలదొక్కుకోటానికి మాచేత ఏబీసీడీలు దిద్దించి మా భవిష్యత్తుకు పునాదిరాళ్ళు వేసారు. మీబాధ్యతల బరువులో మాకూ స్థానమిచ్చి మమ్మల్ని గౌరవించారు. నూతిలో కప్పలుగా పెరిగిన ఆడవాళ్ళకు అమెరికా పేరుతో అందమైన సువిశాల ప్రపంచాన్ని చూపించారు.

నేను పుట్టి బుద్ధెరిగిన తర్వాత పట్నంలో చూసిన ఒకటీ అరా సినిమాలు, మాఊళ్ళో వేసే వీధినాటకాలు, స్కూలు పుస్తకాలు తప్ప వేరే ప్రపంచం ఎరగనిదాన్ని. అలాంటి నేను ఈ దేశం వచ్చి ఎన్ని కచేరీలు విన్నాను----ఎన్ని అద్భుతమైన నాట్యాలు చూసాను---ఎంతమంది గొప్ప రచయితలను కలుసుకున్నాను, ఎన్ని చక్కని ఉపన్యాసాలు విన్నాను, తలుచుకుంటే నాకే ఆశ్చర్యమేస్తుంది !! ఎక్కడో మారుమూల పుట్టిన నేను ఇక్కడకు వచ్చి ఎం.ఎస్. సుబ్బలక్ష్మి గానకచేరీని విన్నప్పుడు నా జన్మ ధన్యమయిందనుకున్నాను. వెంపటివారి కూచిపూడి నృత్యాలు చూసినప్పుడు నా వొళ్ళు పులకరించిపోయింది. ఘంటసాలవారి గాన మాధుర్యాన్ని విని నన్ను నేనే మరిచిపోయాను. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నెన్నో------

నాతో పుట్టిపెరిగిన ఆడపిల్లలకుమల్లే నేను కుడా "వారింట్లో లేరు. వారొచ్చాక అడిగి చెప్తాను" అంటూ బతకాల్సిన నేను ఈ సమాజంలో ఇంత చక్కటి గుర్తింపుతో, ఇంతమంది స్నేహితులమధ్య ఇంత ఆనందంగా జీవిస్తున్నాను అంటే దీనికంతటికి కారణం మీరే కదండీ ?

చిన్నప్పుడు కలిసిమెలిసి పెరిగిన నా మేనత్త కూతురు దాని మనవడ్ని చూట్టానికి ఈదేశం వచ్చి మనింటికి కూడా వచ్చింది.

మీరు అదే టైములో పనిమీద వేరే వూరు వెళ్ళారు. అది వున్న నాలుగు రోజులు ఇద్దరం తిండితిప్పలూ మర్చిపోయి కరువుతీరా కబుర్లు చెప్పుకున్నాం. దాన్ని నేను మన ఊరంతా తిప్పి అన్నీ చూపించాను. అది వద్దుంటున్నా షాపింగుకు తీసుకెళ్ళి దానికి అన్నీ కొనిపెట్టాను. ఒక రోజు మన ఫ్రెండ్సు అందర్నీ పిలిచి దాన్ని పరిచయం చేసాను. అది వెళ్ళేముందు ఏమందో తెలుసా?

'ఒసేవ్, నిన్ను చూస్తుంటే నాకు చాలా గర్వంగా వుందే" అన్నది !

అందుకే నాకు మీరంటే ఎంతో ఇష్టం !

అమెరికా తీసుకొచ్చి నాలాంటి ఆడవాళ్ళకు ఆత్మ విశ్వాసంతో పాటు సరికొత్త జీవితాన్ని ఇచ్చిన మీ మగవాళ్ళంటే నాకు మహా గౌరవం. అప్పట్లో మన మధ్యతరగతి కుటుంబాలన్నీ పేదరికం అనే బురదలో కూరుకు పోయిన శకటాలే. అటువంటి సంసారాల్ని బయటకు లాగి రోడ్డుమీదకు మళ్ళించిన సంస్కారవంతులు మీరందరు. ఆ రోజుల్లో వచ్చిన మీలాంటి మగాళ్ళందరూ నిజంగా "క్రీమ్ ఆఫ్ ది క్రాప్"

ఏమిటీ ఇవ్వాళ నేను కొత్తకొత్తగా వింతవింతగా మాట్లాడుతున్నానా?

# అమ్మనే - జగదంబనే

**ఏమిటీ నాతో గుడికి రావడానికి రెడీగా వున్నారా?**

నాదే ఆలశ్యమా?

ఇదిగో చీర కట్టుకోవడం అయిపోయింది. పళ్ళు-పూలు సర్దేసి క్షణంలో వచ్చేస్తున్నా !

అయ్యొయ్యో ఏమిటండీ ఈ అవతారం? !

ఇలాగా దైవదర్శనానికి వెళ్ళటం? మిమ్మల్ని చూస్తుంటే గుడికి వెళ్ళేవాళ్ళలా లేరు. సామర్లకోటలో సామాను మోసేవాడిలా వున్నారు !

లూజులూజుగా ఆ పొట్టిలాగు, దసరాబుల్లోడికిమల్లే ఆ పూల చొక్కా, నెత్తిమీద ఆ దిక్కుమాలిన క్యాపు, బొజ్జో ఆ సెల్ ఫోన్‌తో భలేవున్నారండి ! ఈ గెటప్‌లో, గుడికి వెళ్తున్న పెద్దమనిషిలా లేరు, చచ్చు సినిమాలు తీసే డైరెక్టరులా వున్నారు.

ఏమిటీ బయట వేడిగా వుందా? సమ్మర్‌లో ఇలా వుంటేనే హాయిగా వుంటుందా? ఇలా వెళ్తే తప్పేమిటీ అని అడుగుతున్నారా?

ఇకనేం, రోజూ ఆఫీసుక్కూడా ఈ అవతారంతోనే వేంచేయవచ్చుకదా? ముచ్చెమటలు పోస్తున్నా పొట్టలు బిగించి పాంట్లు, మెడకు ఉరితాడల్లే టైలు వేసుకుని వెళ్తారెందుకూ?

ఏమిటీ ఇలా వెళితే ఉద్యోగం ఊడపీకి ఇంటికి దయచేయమంటారా?

నాకు తెలీక అడుగుతా, ఈ అవతారం ఆఫీసుకు పనికిరాదు. కానీ ఆలయానికి మాత్రం పనికొస్తుందన్నమాట.

మీకు రానురాను మతి పోతోంది. వెనకటికి మీలాంటివాడే చదువుకోకముందు కాకరకాయ అని, చదువుకున్నాక కీకరకాయ అన్నాట్ట! ‘బీ రోమన్ ఇన్ రోమ్‘ అంటూ ఎక్కడుంటే అక్కడికి తగ్గట్టు ప్రాపరుగా

డ్రెస్ అవ్వాలంటూ వెనకటి రోజుల్లో మా ఆడాళ్ళకు ఉపదేశాలు చేసారు గుర్తుందా? మరి ఆ సూత్రం గుడికెళ్ళేటప్పుడు మీకు గుర్తుండదా?

అసలు మీకు చేసే పని మీద శ్రద్ధ ఏడిచి చస్తేకదా? ఎప్పుడొచ్చినా నన్నేదో వుద్ధరించడానికన్నట్లు బయలుదేరుతారు.

అక్కడికి వెళ్ళాక ఆ దేముడికేదో ఫేవర్ చేస్తున్నట్లు మొక్కుబడిగా ఓ నమస్కారం పడేయటం, ఆ తరువాత నుంచి ఎప్పుడు బయటపడదామా అని చూస్తూవుంటారు. లేకపోతే చిన్నపిల్లలకుమల్లే ఆకలేస్తోంది-దాహమేస్తోందీ అంటూ మొదలుపెడతారు. అసలు మీరు గుడికి ఎందుకు వస్తారో నాకు బాగా తెలుసు.

మీ అసలు భక్తి అంతా దేవాలయం కేఫటేరియాలో దొరికే దోసెలమీద ! దేముడిముందు ఒక్క నిమిషం కూడా నిలబడలేరు కాని అక్కడ దొరికే గారెలకోసం గంటలతరబడి లైన్లలో నిలబడగలరు ! చూపులు దేముడిమీద చిత్తం చెప్పులమీద అని మీలాంటివాళ్ళకు మనసంతా ఫుడ్డుమీద !

గుళ్ళో ఆఫీసుకు ఫోన్లు చేసే మీబోటి వాళ్ళు ‘గుడి ఎప్పుడు తెరుస్తారు? ఇవాళ స్పెషల్ పూజలేమిటీ?‘ అని కాదు, ‘కేఫటేరియా ఎప్పుడు తెరుస్తారు? లంచ్ స్పెషల్ ఏమిటీ‘ అని ఎంక్వైరీలు! మొన్నామధ్య అఫీసు దగ్గర క్యాలెండరు కొనుక్కోటానికి లైన్లో నుంచున్నాను. నా ముందరాయన ఎవరో మీబోటివాడే ‘అర్చన వితౌట్ కొకోనట్‘ అనటానికి బదులు‘అర్చనా వితౌట్ ఆనియన్స్‘అన్నాడు! పాపం శనివారం పూట ఉల్లిపాయముట్టని

మహాభక్తుడు !

అన్నట్టు చిత్తం చెప్పులమీద అంటే గుర్తొచ్చిందీ మనుషుల్లో సివిక్ సెన్స్ ఇంత అధ్వాన్నంగా వున్నదేమండీ?

ఆలయంలోకి వచ్చినవాళ్ళు చెప్పులు షెల్ఫ్‌లో పెట్టకుండా ఇష్టంవచ్చినట్లు నేలమీద విడిచేస్తారెందుకూ?

ఆ షెల్ఫ్ ఏదో నొచ్చుకుంటుందన్నట్లు దాన్ని ఖాళీగా వదిలేసి దానిముందరే అడ్డదిడ్డంగా వదిలేస్తారు కాని చక్కగా లోపల పెట్టరు. అక్కడికి వచ్చేవాళ్ళందరూ పెద్ద పెద్ద చదువులు చదివినవాళ్ళే. అలాంటి వాళ్ళే ఇలా చేస్తున్నారంటే నాకు చాలా అశ్చర్యం వేస్తుంది సుమండీ !

ఏమిటీ? ఎవరూ మిగిలిన చోట్ల అట్లా వుండరా? మన గుడే కదా అని ఎవరూ సీరియస్‌గా తీసుకోరా?

రూల్స్ పాటించకపోయినా ఎవరూ పట్టించుకోరని అలా చేస్తారా?

ఏడ్చినట్లుంది మీ ఎక్స్‌ప్లనేషను !

ఎప్పుడో ఒక రోజు అలా వదిలేసినవన్నీ గార్బేజిలో పడేసి 'మీ చెప్పులు చెత్తకుండీలో పడేసాము. పట్టించుకోకండీ' అని నాబోటిదంటే అంటే అప్పుడు మీలాంటివాళ్ళ తిక్క కుదురుతుంది !

ఇదిగో మిమ్మల్నే ఇదే మీకు ఫైనల్ వార్నింగు !

భగవంతుడిమీద నిజమైన భక్తి లేనప్పుడు, దేవాలయానికి వెళ్ళే పద్ధతి మీద గౌరవం లేనప్పుడు, గుళ్ళో పెట్టిన రూల్స్‌ని పాటించాలన్న విచక్షణాజ్ఞానం లేనప్పుడు మీకు ఆలయానికి వచ్చే అర్హత లేదు.

అసలు మీరు రావద్దు కూడా.

మీకు కావల్సింది పిచ్చాపాటి, చిరుతిండి అయితే, ఇలాంటి బట్టలేసుకుని ఏ రెస్టారెంటుకో వెళ్ళండి- అంతేకాని- ఊరుకునేదిలేదు-

ఏమిటీ నన్ను చూస్తుంటే చిన్నప్పుడు మిమ్మల్ని కోప్పడిన మీ అమ్మ, ఫ్రెండ్స్‌తో కలిసి కలకత్తాలో చూసిన

కాళికామాత గుర్తు కొస్తున్నారా?

ఇకనుంచి బుద్ధిగా వుంటారా? గుడ్ బాయ్ లాగా గుడికి వస్తారా? ప్రామిస్సా!

అలా దారికి రండి------ మాటతప్పారో అమ్మనే----జగదంబనే----

# భూమి గుండ్రముగానుండును

ఏమిటీ మనం కూడా ఈ పెద్ద ఇల్లు అమ్మేసి చిన్న ఇంట్లోకి మారదామా?

వున్నట్టుండి ఇల్లు మారాల్సిన అవసరం ఏం వచ్చిందటా?

ఖర్చులు తగ్గించుకొని లైఫుని సింప్లిఫై చేసుకుని హాయిగా ఎన్‌జాయ్ చేద్దాం అంటారా!

"లైఫు-ఎన్‌జాయ్" ఇదే కదా మన తారకమంత్రం. దీనికోసమే కదా ఇంతదూరం పడి వచ్చాం!

అలాగే చూద్దాంలెండి.

ఎందుకు నాలో నేనే నవ్వుకుంటున్నానంటారా?

మీ మాటలకు నా ఫ్రెండు సరోజ గుర్తొచ్చింది !

నెలరోజుల్నాడు ఫ్లోరిడా వెళ్ళినప్పుడు నా చిన్నప్పటి స్నేహితురాల్ని కలిసాను గుర్తుందా?

దేవేంద్రభవనంలా వున్న దాని ఇల్లంతా చూపించి, చివరకు బ్యాక్ యార్డ్ లోకి తీసుకొచ్చింది.

నేను ఇల్లు చాలా బావుందే అనేలోపునే చెట్టుకింద వున్న కుర్చీలో చతికిలపడుతూ, "ఇది నా ఫేవరేట్ ప్లేస్. ప్రాక్టీసు మానేసిన మర్నాడే ఈ చెట్టుకింద కూర్చుని హాయిగా పుస్తకాలు చదువుకుంటూ లైఫ్ ఎంజాయ్ చేస్తాను" అంది.

ఆ మాటలకు నేను నవ్వితే దానికి కోపం కూడా వచ్చింది !

మేము స్కూల్లో చదువుకునే రోజుల్లో, "నేను పెద్ద డాక్టర్ని అయి పెద్ద ఇల్లు కట్టుకుంటాను" అనేది ప్రతి రోజు. ఆ మాట గుర్తు

చేస్తే పడీపడీ నవ్వింది !

"లైఫూ-ఎన్‌జాయ్" అంటుంటే అది గుర్తొచ్చి నవ్వొచ్చింది !

చూద్దాం అంటే కుదరదా?

మంచి ఇల్లు మార్కెట్ లోకి వచ్చిందా? మనం తొందరపడకపోతే ఎవరో ఒకరు ఎగరేసుకుపోతారా?

మనిషి ఎప్పుడూ దేనికోదానికి ఆరాటపడుతూనేవుంటాడు. లేనిదానికోసం పాకులాడుతూ, వున్నదాన్ని ఒలకపోసుకుంటూ వుంటాడు.

ఉన్నదాన్ని లేదనుకొని, ఆ లేనిదాన్ని సంపాదించుకున్నానని భ్రమిస్తూ తృప్తి పడుతూ వుంటాడు!

ఏమిటీ ఈమధ్య నేను తిక్కతిక్కగా మాట్లాడుతున్నానా?

నేను తిక్కతిక్కగా మాట్లాడటంలేదు, మనిషి ఆలోచనే తికమక అని చెప్తున్నా.

వెనకటికి ఓ కట్టెలు కొట్టేవాడు రోజంతా పనిచేసి ఆ తర్వాత హాయిగా ఈతకొట్టి చెరువు ఒడ్డున చెట్టుకింద కూర్చొని చుట్ట తాగుతూ స్వర్గలోకాన్ని చుట్టివస్తుంటే, ఒకరోజు మీబోటిగాడు అక్కడికి వెళ్ళి 'ఎందుకు ఒళ్ళు ఇంతలా హూనం చేసుకుంటావ్?

పట్నం వెళ్ళి కట్టెల అడితి పెట్టుకుని బోలెడు సంపాదించవచ్చుకదా' అని అన్నాట్ట.

అప్పుడు ఆ అమాయకుడు ' డబ్బు సంపాదించటానికి రాత్రింబగళ్ళు అంతలా కష్టపడతావుంటే మరి నాకెప్పుడు ఇశ్రాంతి దొరుకుద్దీ?' అని ఎదురు ప్రశ్న వేశాట్ట. దానికి ఈ పెద్దమనిషి చాలా తెలివిగా ' అదేమిటోయ్, అప్పుడప్పుడూ నాలాగా పట్నంనుంచి ఇలాంటి ప్రశాంతమైన చోటుకి వచ్చి సరస్సులో ఈతలు కొడుతూ ప్రకృతిని చూసి పరవశించిపోవచ్చుకదా' అని అన్నాట్ట.

వెంటనే ఆ కట్టెలు కొట్టేవాడు ' ఆ పని నాను వుప్పుడే సేస్తుండా కద సామీ" అని అన్నాట్ట!!

మనమూ ఆ పెద్ద మనిషిలాంటి వాళ్ళమే.

ఎలా అంటారా?

ఇండియాలో వున్నప్పుడు అందరికీ ఎప్పుడెప్పుడు అమెరికా వెళ్దామా అని ఆరాటం.

అమెరికా వచ్చాక ఎప్పుడు ఇండియా చెక్కేద్దామా అని ఐడియాల కోసం చూడటం.

ఇండియాలో వున్నప్పుడు హోటళ్ళకెళ్ళి స్టైలుగా టోస్టు-జాము ఆర్డరు చెయ్యడం.

అమెరికా వచ్చాక బ్రేక్ ఫాస్టుకు బ్రెడ్డు చూసి బుంగమూతి పెట్టడం.

ఇండియాలో వున్నప్పుడు చింతకాయ పచ్చడిని చిన్నచూపు చూడటం.

అమెరికా వచ్చి చింతకాయ పచ్చడి లేదని అదేపనిగా చింతించడం.

ఇండియాలో వున్నప్పుడు ఆష్-భూష్ అంటూ ఇంగ్లీషులో మాట్లాడటం.

అమెరికా వచ్చి అయ్యో పిల్లలు తెలుగు మాట్లాడటం లేదని ఆవేదన పడటం.

ఇండియాలో వున్నప్పుడు వెస్టన్ అమ్మాయిలాగా వుండాలని ఉబలాటపడటం.

అమెరికా వచ్చి అచ్చ తెలుగు ఆడపడుచులా వుండాలని అభిలాష పడటం.

అమెరికాలో లైఫు మొదలు పెట్టీ పెట్టగానే మాంషన్లు కొనేసుకోవడం.
అమెరికాలో రిటైరుమెంటు ఏజ్ వచ్చీ రాగానే మార్టిగేజ్ సైజు రెడ్యూస్ చెయ్యాలని తహ తహ లాడిపోవడం!

ఇప్పటికైనా అర్ధమైందా మనం ఎంత తెలివి తక్కువ వాళ్ళమో?
ఏమిటీ నాకు పైత్యం ఎక్కువైందా? అందుకే ఇలా పిచ్చిగా మాట్లాడుతున్నానా?

# అబ్బురం.. అపురూపం

**ఏమిటీ అలా బుంగమూతి పెట్టుకుని కూర్చున్నారూ?**

నాకు తెలుసులేండి మీరెందుకు అలిగారో? మీమనవడ్ని చూడాలని మీకు ఆత్రంగా వుంది. కోడలు పిల్లేమో ఈవారం కుదరదు, పైవారం చూద్దాంలెండి అంది. అందుకని మీరు చిన్నపిల్లాడిలా అలిగి కూర్చున్నారు!

మీరు తాతగారైనప్పటినుంచి మీకు ఇంట్లో కాలు నిలవటంలేదు. అస్తమానం వాడితో ఆడుకోవాలని చూస్తారు !

మీ మనవడ్ని చూసుకోవటానికి మధ్యలో ఈ పిల్లల పర్మిషన్ లేవిటీ అంటారా?

అంతేమరి కాలం మారింది. ఇప్పుడు పిల్లలంతా రూల్స్ ప్రకారం పెరుగుతున్నారు. అన్నీ టైం ప్రకారం టకటక జరిగిపోవాలి. మీరు చీటికిమాటికి వెళ్ళి వాళ్ళ నెత్తిన కూర్చుంటే వాళ్ళ రొటీను-షెడ్యూలు అంతా మెస్ అప్ అయిపోదూ? ఇప్పుడు పిల్లల్ని పెంచడం అంటే మీకాలంలో పెంచినట్టుకాదు. ఈ పెంపకమే వేరు. అసలు పిల్లలు పుట్టకుండానే ఎంత హడావిడి ఎంత హంగామా !

మన కోడలు కడుపుతూ వున్నన్నాళ్ళూ మనవాడు ఆ అమ్మాయిని కాలు కిందపెట్టనిచ్చాడా? ఇక డెలివరీ టైములో అయితే చెప్పనక్కరలేదు.

పక్కనేవుండి పెళ్ళానికి కోచింగు ఇస్తూ, ఓపికగా ఓదారుస్తూ, మధ్యమధ్యలో ఆ అమ్మాయి పెట్టే చివాట్లు తింటూ, ఇంకోపక్క వీడియో తీస్తూ వీడే కన్నంత పని చేసాడు !

మన టైములో మీ మగాళ్ళకు అంత శ్రద్ధాలేదూ, మా ఆడాళ్ళకు అన్ని తెలివితేటలూ లేవు.

మన పెద్దవాడు పుట్టినప్పుడు గుర్తుందా?

నెప్పులొస్తున్నాయని నేనంటే "అయితే పద" అంటూ వున్నపళంగా కారులో కూలేసి హాస్పిటల్‌కు తీసికెళ్ళారు.

డాక్టరు "ఇంకా టైముంది" అనగానే, "అయితే ఇక్కడుండి నేను చేసేదేముంది' అంటూ ఇంటికెళ్ళి తీరుబడిగా తర్వాత ఎప్పుడో వచ్చారు.

రెండోవాడు పుట్టినప్పుడు రవ్వంత మార్పు వచ్చింది మీలో. అప్పుడు నేను "అర్జెంట్" అన్నానని, అ కంగారులో నన్ను తీసికెళ్ళి సరాసరి హాస్పిటల్ లాబీలో దింపేసారు. అప్పుడే వూరుమారిన మీకు అంతా కొత్త అవడంచేత, మీరు కారు పార్కు చేసి హాస్పిటల్‌లో నేను ఎక్కడున్నానో వెతికి పట్టుకునేసరికి అబ్బాయి పుట్టేసాడు. అలిసిపోయి నిద్రమత్తులోవున్న నన్ను, అప్పుడే పుట్టిన పసిగుడ్డును చూసేసి వచ్చిన పనైపోయిందని ఇంటికెళ్ళి హాయిగా నిద్రతీసారు! నేను ఇంటికొచ్చేవరకు మన బుజ్జిగాడ్ని పాపం లక్ష్మిగారే చూసుకున్నారు.

అప్పట్లో ఎవరికి ఏం అవసరమొచ్చినా గభాలున వెళ్ళిపోయేవాళ్ళం. చెయ్యగలమా లేదా అని ఆలోచించే వాళ్ళం కాదు. మీకు గుర్తుందా?

మన శంకర్రావుగారి అమ్మాయి మాంచి స్నో స్టార్మ్ చూసుకుని మరీ పుట్టింది. అందుకే దానికి 'హిమ' అని పేరు పెట్టారు!

మోకాటిలోతు స్నోలో పిల్లను ఎలా తేవడమా అని ఆయన ఆదుర్దా పడుతుంటే మీరందరూ వెళ్ళి కూరుకుపోయిన కారుని స్నోలో నుంచి పెళ్ళగించి, శంకర్రావుగారి కుటుంబాన్ని సాహసోపేతంగా ఇంటికి చేర్చారు ! సీటు బెల్టులు, ఎయిర్ బాగ్‌లు అంటే ఏమిటో ఎరగని రోజులవి.

మనతో వుండి వెళ్ళిన శర్మగారికి అబ్బాయి పుట్టాడని అందరం ఒక లాంగు వీకెండునాడు పాలోమని వాళ్ళ వూరు వెళ్ళాం. ఆకలి అవగానే పాలు తాగేసి వాడు గుప్ చిప్ గా పడుకుంటే మనం మాత్రం చిన్న పిల్లల్లా 'గోలగోల' చేసాం ! మనం వున్న మూడురోజులు కబుర్లతో, నవ్వులతో వాళ్ళ ఇల్లు హోరెత్తించేసాం. ఆ రోజులు కాబట్టి మన వేషాలు చెల్లాయి. అప్పట్లో ఎవరం ఎవరింటికి వెళ్ళినా అది 'మన ఇల్లే' అన్నంత స్వతంత్రంగా తిరిగేవాళ్ళం.

ఇప్పుడు మన పిల్లలింటికెళ్ళినా పరాయి ఇంటికెళ్ళినంత జాగ్రత్తగా వుండాలి. పెద్దగా మాట్లాడకూడదు. తెలుగు సినిమాలు చూడకూడదు. వాసనలొచ్చేటట్లు వంటలు చేయకూడదు, డీప్ ఫ్రై అసలే చేయకూడదు. పర్మిషన్ లేకుండా పిల్లల చేతిలో చాక్‌లెట్ కూడా పెట్టకూడదు. ఇలాంటివి చచ్చినన్ని !

మన పిల్లలు కాస్తలో కాస్త నయం.

మొన్న వెంకట్రావుగారు చెప్తున్నారు- మనవడ్ని చూడ్డానికి కూతురింటికెళ్ళారుట. వాళ్ళింట్లో రాత్రి తొమ్మిది తర్వాత టీవీ చూడకూడదుట, టాయిలెట్ ఫ్లష్ చెయ్యకూడదుట ! అందుకని ఈయన వెళ్ళిన రోజు వాళ్ళమ్మాయి వున్నట్టుండి ఠక్కున టీవీ ఆపేసి, ఇప్పుడే బాత్ రూముకెళ్ళేసి పడుకోమందిట. అదేమంటే వాళ్ళ అబ్బాయికి నిద్రాభంగమవుతుందిట. చప్పుడుకు లేస్తే ఓ పట్టాన పడుకోడుట. నాలుగు రోజులుందామని వెళ్ళినాయన మర్నాడే పెట్టేబేడా సర్దుకుని లేచక్కా వచ్చారుట !

ఈ కాలప్పిల్లలు వాళ్ళే పిల్లల్ని కంటున్నారనుకుంటారు !

అవసరం అయినప్పుడల్లా పిల్లల్ని చూసుకోడానికి మనం కావాలి. కాని పిల్లల్ని మనమీద వదిలెయ్యాలంటే వాళ్ళకు

చచ్చేటంత అనుమానం.

'ఆర్ యు షూర్ యు కెన్ హాండిల్ దెమ్ ?' అంటూ అడుగుతారు.

పద్మగారు చెపుతున్నారు-మనవరాల్ని చూసుకోవాల్సివచ్చినప్పుడల్లా ఆవిడకు గుండెల్లో రైళ్ళు పరిగెడతాయట. కష్టపడి చూసిందికాక కూతురు అడిగే ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేక ఆవిడ బుర్ర తిరిగిపోతుందిట. 'ఎన్ని ఔన్సులు పాలు తాగింది?ఎన్నిసార్లు కక్కింది? ఎన్నిసార్లు నవ్వింది, తుమ్మింది? ఏ మ్యూజిక్ వింటూ నిద్రపోయిందీ?' అంటూ యక్ష ప్రశ్నలు వేసి చంపుతుందిట !

మనం ఎన్ననుకున్నా ఎవరి పిల్లలు వాళ్ళకు అపురూపం-అబ్బురమూనూ. అది సహజమే.

ఏమిటీ మనం ఏమీ వీళ్ళలాగా అతిగా బిహేవ్ చెయ్యలేదా?

అని మీరనుకుంటున్నారు. కానీ మీ టైములో మీరూ అదే చేసారు !

పిల్లల్ని ఇండియా తీసికెళ్ళాలంటే మీకు ప్రాణాంతకంగా ఉండేది గుర్తుందా?

పెద్దవాడు పసివాడుగా వున్నప్పుడు ఇండియా వెళ్ళాం. మీ బామ్మగారు వాడు గుక్కపట్టి ఏడుస్తున్నా లెక్కచెయ్యకుండా నూనెతో వళ్ళంతా మర్దనచేసి, సున్నిపిండితో నలుగుపెట్టి, వేడినీళ్ళతో స్నానం చేయించారని మీకు గొంతువరకు కోపం వచ్చింది ! ఇక మీదట మీ కొడుకుని ముట్టుకోవడానికి వీల్లేదని అంత పెద్దావిడను బెదిరించారు ! మీ ధోరణికి ఆవిడ ఆశ్చర్యపోయి ముక్కుమీద వేలేసుకొని 'అబ్బో ఏమి అబ్బురమే అమ్మా' అన్నారు !

ఆ తర్వాత రెండోవాడిని తీసికెళ్ళినప్పుడు, వాడు అప్పుడే బాగా పారాడుతున్నాడు. తెల్లగా, దొరబాబల్లే వున్న మీ అబ్బాయిని కిందికి దించితే ఎక్కడ మట్టి అంటుతుందోనని అక్కడవున్నన్నాళ్ళు వాడిని ఎత్తుకు మోసారు గుర్తుందా?

'పిల్లలన్నాక మట్టి అంటకుండానే పెరుగుతారా? ఏం అపురూపమే తల్లీ!' అంటూ మీ అమ్మగారు బుగ్గలు నొక్కుకోవడం నాకు బాగా గుర్తుంది !

ఏమిటీ అప్పటి పరిస్థితులు వేరా? దానికి దీనికీ సంబంధంలేదా? !